ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 31 జనవరి 2024




జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న పరీక్ష కేంద్రాన్ని తొలగించిన దృశ్యం
పోస్టుమార్టం సమయంలో ఉన్న రద్దీ (ఫైల్)

పబ్లిక్‌గానే.. పోస్ట్‌మార్టం

జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కనే శవ పరీక్షలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- ట్రాఫిక్‌కు అంతరాయం.. చోద్యం చూస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్(మహబూబాబాద్), జనవరి 30 : మహబూబాబాద్ మెడికల్ కళాశాల పరిధిలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి శవ పరీక్ష కేంద్రం (పోస్టుమార్టం గది) రోడ్డు పక్కనే ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏరియా ఆస్పత్రిగా ఉన్న ప్రస్తుత జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వెనుక గేటు భాగం సందులోని ఒక గదిలో శవ పరీక్ష కేంద్రం ఉండేది. మానుకోట జిల్లా కేంద్రంగా ఏర్పాటైన తర్వాత ఈ ఏరియా ఆస్పత్రి కాస్త జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా 33 పడకల నుంచి 330 పడకలకు విస్తరించింది. దీంతో నిత్యం జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి కోసం వచ్చే బంధువుల సంఖ్య రోజు రోజుకు పెరిగింది. జిల్లా ఆస్పత్రి ఆవరణ మొత్తం వాహనాలతో కిక్కిరిసి ఉండేది. దీనికి తోడు ప్రమాదవశాత్తు ఎవరైనా మృతి చెందితే పోస్టుమార్టం కోసం సుదూర ప్రాంతాల నుంచి మృతదేహాలను తీసుకువచ్చి వారి కోసం వచ్చే బంధువులతో ఆస్పత్రి ప్రాంగణం మొత్తం రద్దీగా మారేది. ఈ క్రమంలో ఎమర్జెన్సీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి వైద్యాధికారులు ఆస్పత్రి నుంచి శవ పరీక్ష కేంద్రాన్ని తొలగించి వెనుక భాగం రోడ్డు అవతలి వైపు ఉన్న వైద్య ఆరోగ్యశాఖ డ్రగ్స్ నిల్వ కేంద్రం భవనంలోకి మూడు నెలల క్రితం తరలించారు.

పోస్టుమార్టం గదిని ఆనుకుని ప్రధాన రహదారి ఉండడంతో నిత్యం వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇదే దారిన వెళ్లాల్సి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శవ పరీక్ష కేంద్రం మెయిన్ రోడ్డుకు ఉండడంతో పోస్ట్‌మార్టం కోసం వచ్చే ప్రజలు, వారి వాహనాలతో రోడ్డంతా రద్దీగా ఉంటుంది. కాగా, ఇతరత్రా పనుల కోసం వచ్చే ప్రజలకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.

జిల్లాలో పోస్ట్‌మార్టం పరిధిలో..

మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు, 461 గ్రామాల్లో 21 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీలు, 174 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో మహబూబాబాద్ పోస్ట్‌మార్టం పరిధిలో గూడూరు, తొర్రూరు సబ్ పోస్ట్‌మార్టం కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా శవ పరీక్షల కోసం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలోని పోస్ట్‌మార్టంకు ఎక్కువ సంఖ్యలో మృతదేహాలను తీసుకువస్తారు. కాగా, రైల్వే మృతదేహాలు, రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారికి ఎక్కువగా మహబూబాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహిస్తారు.

అత్యవసర పనుల కోసం వెళ్లేవారికి..

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్, కూరగాయల మార్కెట్‌కు వచ్చే, ఇతర అత్యవసర పనుల కోసం వచ్చే ప్రజలు ఇదే దారిన వెళ్తుంటారు. పోస్ట్‌మార్టం చేసే రోజున ఈ రహదారి మృతుల బంధువులతో నిండి ఉండడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా మెయిన్ రోడ్డుకు పక్కనే పోస్ట్‌మార్టం గది ఉండడం ద్వారా రాత్రి వేళల్లో కాలినడకన వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు జంకుతున్నారు. అనుమానాస్పద, ప్రమాదవశాత్తు మృతులకు సంబంధించి వారి బంధువులు పోస్ట్‌మార్టం రోడ్డు వద్ద ఆందోళనలు చేస్తే ఆరోజంతా ఆ మార్గం గుండా వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. నిత్యం రాకపోకలు సాగే రోడ్డు వెంట కాకుండా దూరంగా ఉన్న మెడికల్ కళాశాలలో పోస్ట్‌మార్టం నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శవ పరీక్ష కేంద్రాన్ని తరలించాలి

- కొండ్ర ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్-టీఎస్, రాష్ట్ర కార్యదర్శి, మహబూబాబాద్



జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న శవ పరీక్ష కేంద్రాన్ని మెడికల్ కళాశాలకు తరలించాలి. శవ పరీక్ష కేంద్రం రోడ్డు పక్కనే ఉండడంతో వచ్చిపోయే ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. శవ పరీక్ష కేంద్రాన్ని వెంటనే మెడికల్ కళాశాల వద్దకు తరలించాలి.

ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బందిగా ఉందని తరలించాం

- బత్తుల శ్రీనివాసరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్, మహబూబాబాద్



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న శవ పరీక్ష కేంద్రాన్ని ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బందిగా ఉందని మూడు నెలల క్రితం వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న డ్రగ్స్ నిల్వ కేంద్రంలోకి తాత్కాలికంగా తరలించాం. త్వరలోనే మెడికల్ కళాశాల భవన నిర్మాణం పూర్తి కాగానే అక్కడికి తరలిస్తాం.


భోజన వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా పెండింగ్ దరఖాస్తులపై సంబంధిత రెవెన్యూ అధికారులతో మంగళవారం గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫారం-6, 7, 8ల కింద స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ నెలఖారులోగా పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తి చేసేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాలన్నారు. కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్‌లో ఎక్కువగా దరఖాస్తులు పెండింగ్ ఉన్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని మానుకోట ఆర్డీవోను ఆదేశించారు. ఆన్‌లైన్ రిపోర్టులు ఎప్పటికప్పుడు అందజేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటు నమోదు చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, ఎన్నికల విభాగం అధికారులు మాధవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులకు సౌకర్యాలు కల్పించాలి..

హైదరాబాద్‌లో నియామక పత్రాలందుకునేందుకు వెళ్తున్న స్టాఫ్‌నర్సు ఉద్యోగులకు భోజనవసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. స్టాఫ్ నర్సులకు వసతి కల్పించిన మహబూబాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను మంగళవారం సందర్శించి భోజన వసతి, రవాణా సౌకర్యాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 93 మంది స్టాఫ్‌నర్సులు ఎంపికైనందున నియామక పత్రాలు అందుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నందున వారికి కావాల్సిన భోజన వసతి, రవాణాసౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బుధవారం ఉదయం ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు 50 సీట్ల సామర్థ్యం కలిగిన రెండు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం. డేవిడ్, చార్డీవో అలివేలు, జిల్లా అధికారులు సూర్యనారాయణ, నర్మద, వెంకటరమణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



మహబూబాబాద్ రూరల్, జనవరి 30: మహబూబాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా యలమంచిల్లి వెంకటేశ్వరరావును నియమిస్తూ మంగళవారం రాత్రి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సత్యనారాయణపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు విద్యార్థి దశలో వీహెచ్‌పీలో పనిచేసి ప్రస్తుతం విశ్వహిందుపరిషత్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఆయనను మహబూబాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల మండల, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు, కుంటల పరిరక్షణకు కృషి చేయాలి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


మహబూబాబాద్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 30: చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా వాటి పరిరక్షణకు అధికారులు కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో మంగళవారం నీటిపారుదల, రెవెన్యూ, మునిసిపల్ శాఖల అధికారులతో సమీక్షించారు. పట్టణంలోని నిజాం చెరువు, కంబాల చెరువు, బంధంకుంట చెరువుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ..జిల్లా కేంద్రంలోని చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ గుర్తించి హద్దులు కేటాయించాలని చెప్పారు. చెరువులు, కుంటలు అన్యక్రాంతం కావడం వల్ల భూగర్భ జలాలు అడుగంటితే తద్వారా తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదముందన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నీటి పారుదలశాఖ ఈఈ సమ్మిరెడ్డి, మునిసిపల్ డీఈ ఉపేందర్, టౌన్‌ప్లానింగ్‌అధికారి నవీన్‌కుమార్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌లో రైతుల ఆందోళన


మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 30 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఓ వ్యాపారి మిర్చికి కాంటాలు చేయడంలో తీవ్ర ఆలస్యం చేస్తుండడంతో రైతులు మంగళవారం సాయంత్రం యార్డులోనే ఆందోళనకు దిగారు. ఆ కంపెనీకి చెందిన కాంటాలు గంటకు పైగా నిలుపుదల చేయడంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో 790 లాట్లలో సుమారు 5 వేల నుంచి 6వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగాయి. మార్కెట్‌లో అత్యధికంగా ఎల్ఎంఎల్ అనే సంస్థకు చెందిన వ్యాపారి ఖరీదులు చేపట్టారు. అయితే ఒకటే కాంట నిర్వహిస్తుండడంతో ఆలస్యం జరుగుతుండడంతో రైతులు తమ సరుకుకే ముందుగా కాంట పెట్టాలంటూ రైతులు కాంటాలు పెట్టే గుమస్తాపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. దాంతో ఆ గుమస్తా కాంటలు నిర్వహించకుండ వెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాల గ్రామాల నుంచి మిర్చి తీసుకువచ్చి రోజుల తరబడి మార్కెట్ యార్డులోనే ఉంటున్నామని, అధికంగా కొనుగోలు చేసిన వ్యాపారి నిర్లక్ష్యంగా ఒకటే కాంట నిర్వహించడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. దాంతో మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్ అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. మరోకాంట తీసుకువచ్చి ఉన్న సరుకును త్వరితగతిన కాంటాలు అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఉన్న ఒక కాంట వద్ద కొనుగోళ్లను పర్యవేక్షించారు.

ఇంటింటికీ నల్లా నీళ్లు ఇవ్వాలని సీపీఐ ఆందోళన


మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 30 : మహబూబాబాద్ మునిసిపల్ 23వ వార్డు పరిధిలో మిషన్‌భగీరథ పైపులైన్ వేసి ఇంటింటికీ నల్లా నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణకార్యదర్శి పెరుగుకుమార్, జిల్లా కార్యవర్గసభ్యులు చింతకుంట్ల వెంకన్న మాట్లాడుతూ.. 23వవార్డు పరిధిలోని పలు కాలనీల్లోని గృహాలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలను నిర్మించడంతో పాటు మిషన్‌భగీరథ పైపులైన్లు వేసి తాగునీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పాలకులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి యాకమ్మ, మామిండ్ల సాంబలక్ష్మిపద్మ, శ్రీకాంత్, రవీందర్, హైమా, ఎల్లయ్య, సాయి, స్వరూప, వెంకన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులం

- వనదేతల సన్నిధిలో మెరుగైన సేవలు అందిస్తాం..
- ములుగు ఎస్పీ శబరీశ్
- పూజారులు, ఆదివాసీ యువతతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

మేడారం, జనవరి 30: పోలీసులు ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిదిలో మెరుగైన సేవలు అందించాలన్నదే ధ్యేయమన్నారు. ఇందుకు తమకు సహకరించాలని కోరారు. తాడ్వాయి మండలం మేడారం పోలీసు సమావేశహాల్‌లో పూజారులు, ఆదివాసీ యువతతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతుందన్నారు. జాతరణ విధుల్లో పాల్గొనే పోలీసులకు యువత తోడ్పాటు అందించి సేవల్లో భాగస్వాముల కావాలన్నారు. జాతర సమయంలో పూజారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఊరేగింపులో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న దేవతలను ఒక్కసారిగా గద్దెలకు చేర్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారులతో రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని ఎస్పీని పూజారులు కోరారు. సమ్మక్క దేవత ఊరేగింపులో మూడంచెల భద్రత వ్యవస్థను ఉంచాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన ఉన్న పోలీసు అధికారులను నియమించాలన్నారు. సమ్మక్కకు చర్ప వంశీయులు సమర్పించే హారతికి భక్తుల రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు.

దీనిపై ఎస్పీ మాట్లాడుతూ.. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గత జాతరలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జాతర విజయవంతానికి యువత సహకారం ముఖ్యమన్నారు. మేడారం తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకునే భక్తులందరినీ మన అతిథులుగా భావించి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, సుభాష్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సిద్ధబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, మహేష్, సారయ్య, కృష్ణయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు, భుజంగరావు, లక్ష్మణ్‌బాబు, కనకమ్మ, గోవర్ధన్, రాజు, బుచ్చిరాములు, మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొండాయి, మల్యాల, పునుగొండ్ల గ్రామాల ఆదివాసీ యువత పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 30: వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21న మహాజాతర ప్రారంభం కానుండగా ముందస్తుగా తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. 20వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివశక్తుల పూనకాలు డోలు, సన్నాయిల మధ్య గద్దెలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా తల్లులకు పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేశారు.

సర్వం సిద్ధం..

- ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్
- 46 పరీక్షా కేంద్రాలు... 8,541 మంది విద్యార్థులు
- మూడు విడతలుగా పరీక్షలు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 30 : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికా రులు సమాయత్తమయ్యారు. జిల్లాలో ప్రభుత్వ ప్రైవే టు జూనియర్ కళాశాలలు మొత్తం 66 ఉండగా అందులో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులు 6,209 మంది, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు 2,332 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. వెరసి 8541 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. అందుకు గాను 46 పరీక్ష కేంద్రాలను కేటాయించారు.

8,541 మంది విద్యార్థులు.. 46 పరీక్ష కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 8,541 మంది విద్యార్థులు హాజరు కానుండగా 46 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం నుంచి ,6209 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 29 సెంటర్లు ఏర్పాటు చేశారు. వారిలో వృక్షశాస్త్రం-972, జంతుశాస్త్రం-972, ఫిజిక్స్-2133, కెమిస్ట్రీ-2132 వెరసి 6209 మంది పరీక్షకు హాజరుకానున్నారు. వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2332 మంది హాజరుకానుండగా 17 సెంటర్లు ఏర్పాటు చేశారు. వీరిలో ప్రథమ సంవత్సరం నుంచి 1231 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1101 మంది వెరసి 2332 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు.

మూడు విడతలుగా...

ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ప్రాక్టికల్ పరీక్షలను మూడు విడతలు, 46 కేంద్రాల్లో నిర్వహించబోతున్నాం. మొదటి విడత ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు, రెండవ విడత 6 నుంచి 11 వరకు, మూడో విడత 12 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించబడతాయి.

పరీక్షలు జరిగే కేంద్రాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు సూపరింటెండెంట్‌లుగా ఉంటారు. పరీక్ష కేంద్రంలో పరీక్ష జరిపే పరీక్షకుడు (ప్రాక్టికల్ ఎగ్జామినర్) పరీక్ష ప్రారంభానికి ముందు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిసి ప్రాక్టికల్ పరీక్షకు అవసరమైన పరీక్ష పరికరాలు, సామగ్రి తనిఖీ చేసుకోవాలని సూచించారు.

సైన్స్ అధ్యాపకుల వివరాలు...

ప్రాక్టికల్ ఎగ్జామినర్‌లుగా నియామక పత్రాలు పొందిన సైన్స్ అధ్యాపకుల పూర్తి వివరాలు ఇంటర్ బోర్డు వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ఎగ్జామినర్‌గా నియామక పత్రం పొందిన అధ్యాపకులు పరీక్ష కేంద్రంలో కంప్యూటర్‌లో tsbie.cgg.gov.in వెబ్ సైట్‌లో ఆ పరీక్ష కేంద్రం కళాశాల లాగిన్ లోకి వెళ్లి ప్రశ్నా పత్రం డౌన్‌లోడ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభించినప్పుడు అతడి సెల్‌ఫోన్ నెంబర్‌కు వన్ టైం పాస్ వర్డ్ (ఓటీపీ) వస్తుంది. ఆ ఓటీపీ నెంబర్ ఉపయోగించినప్పుడు ప్రశ్నపత్రం డౌన్‌లోడ్ అవుతుంది. కానీ పరీక్ష జరిగే రోజు మాత్రమే ఎగ్జామినర్ సెల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ఎగ్జామినర్ మాత్రమే ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాక్టికల్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానం అమలు చేయడంలేదు. ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించడానికి జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారితో పాటు ఇద్దరు సభ్యులుగా ఉంటారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు డీఐఈవో కన్వీనర్‌గా ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ ప్రిన్సిపాల్ నాయిని వీరేందర్, అధ్యాపకులు మధు ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ జరుగనుంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : సమ్మెట సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి



పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు నిర్ణీత సమయానికంటే అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం, మధ్యాహ్నం సమయ పాలన ప్రకారం హాజరుకావాలి. విద్యార్థులు హాల్‌టికెట్‌లు, ప్యాడ్‌లను వెంట తీసుకొచ్చుకోవాలి. విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

భర్తను హత్య చేసిన భార్య

అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ

కొత్తగూడ, జనవరి 30 : భర్తను భార్య హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ఫణిదర్, ఎస్ఐ నగేష్‌లు తెలిపిన ప్రకారం.. కొత్తగూడ మండలం కర్లెగండి గ్రామానికి చెందిన ఊకె శ్రీనివాస్(35) వారం క్రితం ఇంటి వద్ద అనుమానాస్పదంగా మృతి చెందాడు. శ్రీనివాస్ సోదరుడు కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా మృతుడు శ్రీనివాస్‌కు, అతడి భార్య ప్రమీలకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో వారం కిందట జరిగిన వివాదంతో శ్రీనివాస్ తలపై ప్రమీల బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ప్రమీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తాళ్లపూసపల్లిలో కుక్కల స్వైరవిహారం


కొమురయ్యను కుక్క కరవడంతో అయిన గాయం

కేసముద్రం, జనవరి 30 : కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలో గ్రామానికి చెందిన గౌండ్ల కొమురయ్య, కొమిరె అనీల్, మాజీ సర్పంచ్ దాసుతోపాటు 20 మంది వరకు కుక్కకాటుతో గాయాలపాలయ్యారు. గ్రామంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ కరుస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కుక్కలను నివారించాలని మంగళవారం ఆ గ్రామస్తులు గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు.

సోషియాలజీలో సాంబశివరావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 30: కేయూ సోషియాలజీ విభాగం పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం సాంబశివరావుకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టర్స్ ఆఫ్ డిసబులిటీ స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ - ఏ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్టు ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య పర్యవేక్షణలో సాంబశివరావు పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపంకుంటకు చెందిన దివ్యాంగుడైన సాంబశివరావు 70పైగా సినిమా పాటలు, 11 సినిమా కథాలను రాశారు.

సాహిత్యంలోనే సామాజిక చైతన్యం

- వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్
- కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 30: సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం పరిఢవిల్లుతుందని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. మంగళవారం కేయూ, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన వల్లంపట్ల సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సుకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తోందని, తద్వారా సామాజిక చైతన్యం వస్తుందన్నారు. గొప్ప చైతన్య శీలి, ఆచరణ వాది, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని చెప్పారు. వల్లంపట్ల ప్రభుత్వ కార్యక్రమాలను కళారూపాలతో ప్రజలల్లోకి తీసుకువచ్చి చైతన్య పరిచారని అన్నారు. హేతుబద్ధత గీటు రాయి అన్నారు. వాదాలు ఏమైనా దానికి వేదిక తెలుగు విభాగం అవుతోందని చెప్పారు. వర్సిటీలో జరుగున్న పరిశోధన క్రమాన్ని కొనియాడారు. పరిశోధన పట్ల వల్లంపట్ల జీవితాన్ని తీసుకోవడం, ఇతర గొప్ప వ్యక్తుల జీవితాన్ని పరిశోధన అంశంగా తీసుకోవడం నూతన ప్రక్రియని చెప్పారు. సాహిత్యంపై చర్చలో సామాజిక చైతన్యం సాధ్యం అవుతోందని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ బీఎస్‌రాములు మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు 5 దశాబ్దాలుగా తన కలాన్ని, గళాన్ని అర్పించిన నాగేశ్వర్‌రావు గొప్పవారిని చెప్పారు. సదస్సులో ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కామర్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, డాక్టర్ తాళ్ళపల్లి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హనుమకొండ వాసి



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో శ్రేష్ఠ

హనుమకొండ కల్చరల్, జనవరి 30: హనుమకొండ కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన పానికంటి శ్రీశ్రేష్ఠ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ఎంపికైన అత్యంత చిన్న వయస్కురాలు కావడం విశేషం. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదువుతున్న శ్రేష్ఠ.. నెల రోజులుగా న్యూఢిల్లీలో జరుగుతున్న క్యాంపులలో పాల్గొంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా పరేడ్ ప్రత్యేక కవాతులో ఆమె శిక్షణ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అవకాశం, ఆయన ముందు జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

తునికాకు సేకరణకు టెండర్లు వేయాలి..

ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 సీజన్‌లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్ డిమాండ్ చేశారు. ఆయనపేరిట మంగళవారం ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 50 ఆకులతో కూడిన కట్టకు రూ.5 ప్రభుత్వం ధరను నిర్ణయించాలన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లోఉన్న బోనస్‌ను ఆకు సేకరణ పనులకు ముందే చెల్లించాలని పేర్కొన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అవకతవకలు, అవినీతి అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశాలు ఉన్న తునికాకు టెండర్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

నర్సంపేట మునిసిపాలిటీలో వీగిన అవిశ్వాసం

● కోరం లేక వీగిన తీర్మానం ● చైర్మన్ పదవిని నిలబెట్టుకున్న గుంటి రజని



నర్సంపేట మునిసిపాలిటీ అవిశ్వాస సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని వివరిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, వేదికపై కమిషనర్ వెంకటస్వామి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీని పదవి నుంచి తొలగించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేసిన పాచిక పారలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌పై ఇదే పార్టీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ గదికి కమిషనర్ నాయిని వెంకటస్వామితో కలిసి ప్రత్యేక అధికారి స్థానిక ఆర్డీవో కృష్ణవేణి చేరుకున్నారు. షెడ్యూల్ సమయం 11 గంటల వరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు మద్దతు పలికిన మరో కౌన్సిలర్ హాజరవుతారని అందరూ భావించారు. కానీ అంచనాలు తలకిందులై 12గంటల వరకు ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాలేదు. ఆ తర్వాత ప్రత్యేక అధికారి అవిశ్వాస పరీక్షకు మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు.

మునిసిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇందులో 18వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. దీనికి తోడు ఎమ్మెల్యేతో కలిసి 25 మంది సభ్యులు అవుతారు. ఇందులో ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లను అవిశ్వాసానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉన్నారు. మిగిలిన 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు వీరికి మద్దతునిచ్చిన మరో కౌన్సిలర్ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన నలుగురు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగి పోయినట్లు ప్రత్యేక అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ప్రకటించారు.



నర్సంపేట మునిసిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై రవి, సిబ్బంది

హాజరుకాని చైర్‌పర్సన్

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మంది కౌన్సిలర్లతోపాటు మద్దతు ఇచ్చిన మరో కౌన్సిలర్ కలిసి 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. మరో ముగ్గురు కౌన్సిలర్ల మద్దతు లేనిదే అవిశ్వాసం నెగ్గే పరిస్థితి లేదని గ్రహించి సమావేశానికి చైర్‌పర్సన్ గైర్హాజరయ్యారు. మిగిలిన నలుగురిలో ఒకరు నర్సంపేటలోనే ఉండగా మరో ఇద్దరు కౌన్సిలర్లు(దార్ల రమాదేవి, ఎండి. పాషా) మూడు రోజుల క్రితం చైర్‌పర్సన్ రజనికి మద్దతుగా క్యాంపునకు వెళ్లారు. 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 17మంది మద్దతు అవసరం ఉంది. అవిశ్వాసానికి మద్దతునిచ్చిన 14మంది కౌన్సిలర్లకు చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలన్న అవిశ్వాసం నెగ్గక చుక్కెదురైంది. తోటి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నుంచి బయట పడడానికి ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి క్యాంప్‌కు వెళ్లిన చైర్‌పర్సన్ గుంటి రజని చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. దీంతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలని భావించి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 14 మంది కౌన్సిలర్ల ఆలోచన బెడిసి కొట్టింది. అవిశ్వాసం వీగి పోవడంతో వారిలో నిరాశ చోటు చేసుకుంది.

అవిశ్వాస అంశానికి తెర

గత నెల రోజులుగా కొనసాగుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టిన అంశానికి సోమవారం అవిశ్వాసం వీగి పోవడంతో తెరపడినట్లయింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 14మంది కౌన్సిలర్లు మద్దతు పలుకగా నలుగురు అవిశ్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. 17మంది కౌన్సిలర్ల బలం ఉంటేనే అవిశ్వాసం నెగ్గేది. అయితే ఆ 14 మందికి నలుగురు సహకరించక పోవడం, వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా సహకరించకుండా అవిశ్వాసానికి దూరంగా ఉండడంతో కోరం లేక వీగిపోయింది.

బీఆర్ఎస్ పార్టీకి 14 మంది కౌన్సిలర్ల రాజీనామా

మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడి



నర్సంపేటలో తోటి కౌన్సిలర్లతో కలిసి రాజీనామా చేస్తూ వ్రాసిన పత్రాన్ని చూపుతున్న వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురంలో 14మంది కౌన్సిలర్లు మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఏడాది కిందట అవిశ్వాసం పెట్టాలని నిర్ణయానికి వచ్చామన్నారు. అయితే జనవరి 30వ తేదీవరకు అవకాశం లేదని తెలిసి అప్పుడు ఆలోచనను విరమించుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన మాట్లాడుతానని హామీ ఇచ్చారన్నారు. అయినా చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య సమన్వయం చేయకపోవడంతో జనవరి 2న కలెక్టర్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానపత్రాన్ని ఇచ్చామన్నారు. రెండు రోజుల కిందట క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లతో మాట్లాడి సమన్వయం చేస్తానని చెప్పి 15మంది కౌన్సిలర్లతో విప్ పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. ముగ్గురిని పిలిపించి విప్ పత్రంపై సంతకాలు చేయించకపోవడం.. ఇచ్చిన మాటను సుదర్శన్‌రెడ్డి తప్పడంతో మనస్తాపానికి గురైన 14 మంది కౌన్సిలర్లు.. పార్టీకి రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. తమ రాజీనామా లేఖను బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ ద్వారా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పంపిస్తామన్నారు. 14 మంది కౌన్సిలర్లలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారు ఎవరూ లేరన్నారు. డబ్బులు ఆశించిన వారు, భూములను కబ్జా చేసిన వారు లేరన్నారు. ప్రజల వద్ద కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేస్తే మునిసిపాలిటీలో పనులు అవుతాయా ఆలోచించాలన్నారు. చైర్‌పర్సన్‌అసమర్థతతోనే కోట్లాది రూపాయల నిధులున్నా... వార్డుల్లో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఇప్పుడు నిధులు మురిగిపోయే అవకాశాలు ఉన్నాయని వెంకట్‌రెడ్డి వాపోయారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై సూచన మేరకు విప్‌పై తాము సంతకాలు చేశామని, అయితే సంతకాలు చేయని చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో ఆలోచించి కౌన్సిలర్ పదవులకు సైతం రాజీనామా చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రుద్రమల్లీశ్వరి, గంప సునీత, వేల్పుగొండపద్మ, బానాల ఇందిర, దేవోజు తిరుమల, రామసహాయం శ్రీదేవి, గండె రజిత, శీలం రాంబాబు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, జుర్రురాజు ఇతర కౌన్సిలర్లుతోపాటు నాయకులు నాగిశెట్టి ప్రసాద్, రుద్ర ఓం ప్రకాశ్, గండె చం ద్రమౌళి. సుధాకర్‌రెడ్డి, దేవోజు సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేను రాజీనామా చేయడం లేదు: పద్మరాజు

తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని కౌన్సిలర్ వేల్పుగొండ పద్మరాజు మంగళవారం సోషల్ మీడియాలో వెల్లడించారు. అంతకుముందు మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి 14 మందితో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న పద్మరాజు.. సమావేశం అనంతరం తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం లేదని, పార్టీలోనే కొనసాగుతామని వెల్లడించడం కొసమెరుపు. దీంతో 13 మందే రాజీనామా చేసినట్లు భావించాల్సి ఉంటుంది. వీరిలో కూడా ఇంకా ఎవరైనా మనసు మార్చుకుంటారా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

● రూ.1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ ● ఆటో సీజ్



నర్సింహులపేట ఠాణాలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

నర్సింహులపేట, జనవరి 30: నర్సింహులపేట, తొర్రూరు, మరిపెడ మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తొర్రూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు ఫకీరతండాకు చెందిన భూక్య హరికృష్ణ, గుగులోతు గణేష్, గుగులోతు సుమన్, గుగులోతు కళ్యాణ్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న మండలంలోని వంతడుపల తండాకు చెందిన ధరావత్ రూప్‌సింగ్ తన ఇంటి ఎదుట కట్టేసిన మేకపోతును ఎవరో గుర్తుతెలియని వారు ఎత్తుకుపోయారని నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సతీష్ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నర్సింహు లపేట శివారు జయపురం క్రాస్‌రోడ్డువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 5 మేకలు, 4 గొర్రెలతో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొ ని విచారణ చేయగా మరిపెడ మండలంలోని కస్నాతండా, తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, నర్సింహు లపేట మండలంలోని వంతడుపల తండాలో చోరీలకు పాల్పడి గొర్రెలు, మేకలు అపహరించి మార్కెట్‌లో విక్రయాలు జరిపినట్లు నిర్ధారణ జరిగింది. నిందితుల నుంచి రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ చేయడంతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను తొర్రూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దొంగతనం చేసును చేదించిన ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న హెడ్‌పీసీ సంతోష్, రమేష్, వెంకన్న, శ్రీను, ఎం.రమేష్‌లను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ అభినందించి రివార్డు అందజేశారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలింపు ● మానుకోట రైల్వేస్టేషన్‌లో పట్టివేత



గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్రబాబు

నెహ్రూసెంటర్, జనవరి 30 : విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 40 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్ర బాబు తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశ ంలో కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మెగా రాజేందర్‌రొంకడే అనే మహిళ, అదే ప్రాంతానికి చెందిన విజయ్‌భరత్ సద్వార్తేలు గత కొంతకాలంగా విశాఖపట్టణం నుంచి మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల్లోని ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా మంగళవారం తెల్లవారు జామున మహబూ బాబాద్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ తనిఖీలు చేపట్టగా 40 కిలోల గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, రజిత, చిరంజీవి, మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముఖం కడుక్కుంటుండగా నల్లాకు విద్యుత్ సరఫరా

విద్యుదాఘాతంతో గడ్డిగూడెంలో వ్యక్తి మృతి




భూక్య శ్రీను మృతదేహం



భూక్య శ్రీను

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెంతండాకు చెందిన భూక్య శ్రీను (40)తనకున్న 20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి ముఖం కడుక్కునేందుకు ఇంట్లోని నల్లా వద్దకు వెళ్లి ఇనుముతో ఉన్న నల్లా ట్యాప్‌ను పట్టుకున్నాడు. నల్లాకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంగొని, తల్లి ద్వాలీ ఉన్నారు. భార్య మంగొని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదిత్

లింగాలఘణపురం, జనవరి 30: లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన ఏదునూరి ఉదిత్(15) అనే పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఏదునూరి కృష్ణ-రజితల కుమారుడు ఉదిత్ లింగాలఘణపురం టీఎస్ఎంఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఇంటి పక్కనే ఉన్న గొర్రెలదొడ్డిలో మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం తన స్నేహితులతో తాను ఒకట్రెండురోజుల్లో చనిపోతానని తన అంతిమ యాత్రలో డీజే పెట్టాలని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. దీంతో అతని కోరిక మేరకు డీజే ఏర్పాటు చేసి అంతిమయాత్రను నిర్వహించడం గమనార్హం.

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

హనుమకొండ క్రైం, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర మల్టీజోన్‌లో పనిచేస్తున్న నలుగురు డీఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.గంగాధర్ పీటీసీ కరీంనగర్ నుంచి వరంగల్‌కు, కె.నాగయ్య వరంగల్ నుంచి పీటీసీ, ఎం.శ్రీనివాస్ వరంగల్ నుంచి డీపీఆర్, ఎస్. సురేంద్ర వరంగల్ నుంచి రామగుండంలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారు ఒకటి రెండు రోజుల్లోవిధుల్లో చేరాలని ఆదేశించారు.

మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలుపాలి


కలెక్టర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు


మహబూబాబాద్‌లో గాంధీజీ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికులను సన్మానించిన మునిసిపల్ కమిషనర్, వాసవీక్లబ్ బాధ్యులు


బయ్యారంలో గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గూడూరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 30: స్వాతంత్ర్యఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ వారి సేవలను భావితరాలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్‌టొప్పో పాల్గొన్నారు.

●వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 12 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి, వాపవీక్లబ్ డిస్ట్రిక్ట్ వీ-101ఏ వైస్ గవర్నర్ వేమిశెట్టి కిషోర్‌కుమార్, అధ్యక్షుడు సోమ రజనికుమార్, సోమ రాధకృష్ణ, పుల్లఖండం ప్రభాకర్‌రావు, ఇమ్మడి రవికుమార్, శ్రీనివాస్, రామారావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

●కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, గుగులోతు వెంకట్, ఎమ్డీ, హరుణ్, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దండెబోయిన బుజ్జివెంకన్న, పోతురాజు రాజు, రాంచంద్రు, నారాయణనాయక్, చరణ్, గుంజె హన్మంతు, నగేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

●అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించగా డాక్టర్ విజయ్‌కుమార్, వార్డుకౌన్సిలర్ విజయలక్ష్మి వంసతరాణి, వొబిలిశెట్టి రామకృష్ణ, రత్నకుమారి, పుష్పలీల, కిరణ్మయి, నర్మద, రమ్య, దీపిక, నితిన్, సువర్ణ, విజయ, శారద, సృజన, రాజేందర్, అనిత పాల్గొన్నారు.

● మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

●శనిగపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పాఠశాల హెచ్‌ఎం దాశరథిశ్రీధర్, మురళీధరస్వామి, ఎమ్డీ రంజాన్ అలీ, వీరస్వామి, సీహెచ్. ప్రభాకర్, జోప్పిన్, కవిత, అనిత, పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

కేసముద్రంలోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు గుగులోతు దస్రునాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, వసంతరావు పాల్గొన్నారు.

● డోర్నకల్‌లో గాంధీవర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీసెంటర్‌లో ఉన్న గాంధీమహాత్ముడి విగ్రహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాల సుమేర్‌చంద్ జైన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఖాసీమ్, బానోత్ శ్రీను, కిషన్, శ్రీను, రవీందర్, కొండల్‌రావు, వెంకన్న, బాలాజీ పాల్గొన్నారు.

● పెద్దవంగర ఎంపీడీవో కార్యాలయంలో మహత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● తొర్రూరులో చాంబర్ ఆఫ్ కామర్స్, వాసవి క్లబ్‌చ వాసవి వనితా క్లబ్, వాసవి సిల్వర్ స్టార్, వాసవి చత్రపతి యూత్ క్లబ్, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా గాంధీమహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బిజ్జాల అనిల్, సీహెచ్ రాము, మచ్చ సురేష్, దారం గాయత్రి, మాధవి, అఖిల్, నిఖిల్, రామ ఉపేందర్, గౌరి శంకర్. సంతోష్, సోమం రాజశేఖర్, పెదగాని సోమయ్య పాల్గొన్నారు.

● గార్ల మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్, తోడేటి శ్రీనుగౌడ్, జంధ్యాల యాదగిరి, రావూజీ నాయక్, కడియం వెంకన్న, కుమార్‌గౌడ్, విఠల్‌నాయక్, నర్సింహారావు పాల్గొన్నారు.

● కురవిలో కుష్టువ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ విరాజిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, డాక్టర్ బి.స్రవంతి, డిప్యూటీపీఎంవో ఎల్లయ్య, గౌసుద్దీన్, పద్మభాయి పాల్గొన్నారు.

● గూడూరు మండల కేంద్రంలో మహాత్మగాంధీ విగ్రహానికి కాంగ్రెస్, అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు చిట్టి వెంకటేశ్వర్లు, బీరం శ్రీపాల్‌రెడ్డి, మధు, కొమ్మాలు, నరేష్‌రెడ్డి, అర్రెం వీరస్వామి, రసూల్, ముక్తీశ్వర్, ఉమామహేశ్వర్‌రావు, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

● బయ్యారంలోని మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళ్లర్పించారు.కాంగ్రెస్ నాయకులు సత్తిరెడ్డిమల్లయ్య, నిర్మలారెడ్డి, పెద్దినేని వెంకటేశ్వర్‌రావు, రాధాకృష్ణ, సుమన్, సీత్యా, కోటయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

డోర్నకల్, జనవరి 30 :ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిని మంగళవారం కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహ్మద్ ఖయ్యాం సోమవారం రాత్రి స్థానిక సుభాష్ విగ్రహం వద్ద రోడ్డుపక్కన బస్సును నిలుపుదల చేసి కండక్టర్‌తో కలిసి భోజనం చేస్తున్నారు. ఈ క్రమంలో డోర్నకల్ మునిసిపల్ కేంద్రం బంకట్‌సింగ్ తండాకు చెందిన భూక్య సురేష్ అనే వ్యక్తి తన కారు వెళ్లేందుకు బస్సు అడ్డంగా ఉందని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. బస్సు రోడ్డుకు అడ్డంగా లేదని.. అంటుండగానే భూక్య సురేష్ బస్సు డ్రైవర్ ఖయ్యాంను దుర్భాషలాడుతూ.. రాయితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆర్టీసీ డ్రైవర్ ఖయ్యాం తల నుదుటిపై గాయమైంది. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మంగళవారం భూక్య సురేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

పోటెత్తిన పత్తి వాహనాలు

సీసీఐ కేంద్రం వద్ద బారులు..


పడమటిగూడెం కాటన్ మిల్లు ఎదుట బారులు తీరిన పత్తితోడు వాహనాలు

నర్సింహులపేట, జనవరి 30: నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం శివారులోని కాటన్ మిల్లువద్ద మంగళవారం పత్తితోడుతో వాహనాలు బారులు తీరాయి. ఫిబ్రవరి 1 నుంచి సీసీఐ పత్తి కొనుగోల్లు నిలిపివేస్తారనే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రైతులు ఒక్కసారిగా కాటన్ మిల్లువద్ద పత్తిలోడుతో బీరులు తీరారు. ఆదినుంచి పత్తి ధర మార్కెట్‌లో రూ. 6 వేలకు మించకపోవడంతో ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించారు. పత్తి రేటు పెరుగుతుందని ఇంతకాలం వేచిచూసిన రైతులు సీసీఐ కొనుగోలు నిలిపివేసారనే ఆదేశాలు అందడంతో ఒక్కసారిగా కాటన్ మిల్లుల వద్ద బారుతీరారు. ఫిబ్రవరి మాసం చివరి వరకు సీసీఐ కొనుగోళ్ల కొనసాగించాలని పత్తి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్


కేసముద్రం మార్కెట్లో మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జనవరి 30 : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మిర్చి కొనుగోళ్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు, నీళ్లు రావని బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు ఉచిత కరెంటు వస్తోందని తెలిపారు. ఇన్‌చార్జ్ డీఎంవో ప్రసాదరావు, ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, సంకెపల్లి జనార్దన్‌రెడ్డి, చిదిరాల వసంతరావు, వోలం మురళి, శ్రీహరి, బాబ్జి, కొత్తకొండ ఆకాశ్, కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సూపర్‌వైజర్ రాజేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 30 : మహబూబాబాద్ మండలం మాధవాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న పెనుగొండ ప్రవీణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. స్థానిక పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు సంకా బద్రీనారాయణ నేతృత్వంలో శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ-టీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, సౌభాగ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు


వేం నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 30: హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ, ముఖ్యమంత్రి సలహాదారులుగా నియామకమైన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు వేం.నరేందర్‌రెడ్డిని మంగళవారం మానుకోట జిల్లా ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకం గా కలుసుకున్నారు. హైదరాబాద్‌లో వేం.నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహారావు, మండల అధ్యక్షుడు బోనగిరి గిరిధర్‌గుప్తా, జంగాల సదాశివుడు పాల్గొన్నారు.

కుంటుపడుతున్న విద్యపై సభ్యుల మండిపాటు

సభ్యుల సన్మానాలతో సమావేశం ముగింపు


గంగారం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అపర్ణ

గంగారం, జనవరి 30 : నీతి అయోగ్ కింద ఎంపికైన గంగారం మండలంలో ప్రాథమిక విద్య కుంటు కుంటు పడిందని సభ్యులు అధికారులపై మండిపడ్డారు. మంగళవారం గంగారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ సువర్ణపాక సరోజన అధ్యక్షతన జరిగింది. తొలుత జంగాలపల్లి సర్పంచ్ ఇస్లావత్ బాలకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావటంలేనది, ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు సక్రమంగా రావడం లేదని ఆరోపించారు. అనంతరం వివిధ శాఖల అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో అపర్ణ మండలంలో విద్యాశాఖ పనితీరు సక్రమగా లేదని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి పనితీరుపై ఆమె అసతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి మెరుగైన విద్య అందిస్తామని అన్నారు. సర్పంచులకు సన్మానాలు చేసి సమావేశాన్ని ముగించి వారిక వీడ్కో లు పలికారు. జెడ్పీటీసీ ఈసం రమా, వైస్ ఎంపీపీ ముడిగ వీరభద్ర, తహసీల్దార్ రాము, డీఆర్‌వో సతీష్, ఏవో ఉదయ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మీ, హెల్త్ సూపర్ వైజర్ సరోజని తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని విస్మరిస్తే చర్యలు

మరిపెడ, జనవరి 30: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యం అమలవుతున్న ఆరోగ్యలక్ష్మీ వన్‌ఫుల్ మీల్స్ పథకాన్ని అంగన్‌వాడీ టీచర్లు సక్రమంగా అమలు చేయాలని మరిపెడ ఐసీడీఎస్ సీడీపీవో కే.శిరీష అన్నారు. మంగళవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపూర్ 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు వన్‌ఫుల్ మీల్స్ పథకం అమలు తీరుతెన్నులపై అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి పథకం అమలుపై ఆరా తీశారు. స్టోర్‌రూం, స్టాక్ నిలువలు, హాజరు రిజిస్ట్రర్లను ఆమె పరిశీలించారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ, ఆశా వర్కరు శిరీష తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జడ్పీ సీఈవో

కేసముద్రం, జనవరి 30 : కేసముద్రం మండలం అమీనాపురం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన తిరుమల తిరుపతి దేవస్థానం క్యాలెండర్‌ను జడ్పీ సీఈవో రమాదేవి ఆవిష్కరించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్, ఎస్.వెంకటస్వామి, ఎంపీడీవో రవీందర్ రావు, ఏవో బి.వెంకన్న, ఏపీఎం రాజీర్, వద్దిరాజు దేవేందర్, వోలం మురళి, బచ్చు పరమేశ్వర్, కొయగూరి యాకూబ్‌రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రహ్మణసంఘం పట్టణ కమిటీ ఎన్నిక

డోర్నకల్,జనవరి 30 : నాయీ బ్రహ్మణసంఘం పట్టణ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని పాత వేంకటేశ్వర ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డోర్నకల్ పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అవుదుర్తి మల్లికార్జున్,ఉపాధ్యక్షులుగా అవుదుర్తి రవి, ప్రధాన కార్యదర్శిగా మార్కపురం రాము, సహాయ కార్యదర్శిగా అవుదుర్తి రాజేష్, కోశాధికారిగా అవుదుర్తి బిందుకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు అవుదుర్తి వెంకన్న, పావని వెంకన్న, చిత్తనూరి వీరభద్రం, అవుదుర్తి నాగేష్, కంది శ్రీనివాస్, అవుదుర్తి ఉపేందర్, రాజు, రాజశేఖర్, నాగభూషణం, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

తొర్రూరు, జనవరి 30: కుష్టు వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని తొర్రూరు డివిజన్ డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వనాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో కుష్టు వ్యాధి నివారణపై ఆయా శాఖల అధికారులు మునిసిపల్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, కౌన్సిలర్‌లు, వైద్యులు జ్వలిత, మీరజ్, నిరంజని,సరస్వతి పాల్గొన్నారు.

తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మహాత్మ గాంధీ జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రాథమిక కేంద్ర వైద్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. వైద్యులు ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

గూడూరు, జనవరి 30 :తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) గూడూరు మండల శాఖను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గూడూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆ సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులుగా బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తేజావత్ రవీందర్, ఉపాధ్యక్షులుగా పిండి అనిల్‌కుమార్, అజ్మీర వనజ, కోశాధికారిగా దుబ్బకట్ల రమేష్, కార్యదర్శులుగా దేవేందర్, రాజు, శ్రీలత, సాధికసుల్తానా, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా స్వామినాథన్, భాగ్యలక్ష్మి, సాంస్కృతిక కార్యదర్శిగా విలియంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మునిసిపల్ కమిషనర్ సరస్వతి


స్వచ్ఛభారత్ చేపడుతున్న వాసవీ క్లబ్ సభ్యులు

తొర్రూరు, జనవరి 30: ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మునిసిపల్ కమిషనర్ పి. సరస్వతి అన్నారు. మంగళవారం తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలోని 10, 11, 15, 16 వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 16వ వార్డులో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు బిజ్జాల అనిల్ కుమార్, కార్యదర్శి రాము, క్లబ్ సభ్యులు రామ ఉపేందర్, గౌరీశంకర్, మధు, వనితా క్లబ్ అధ్యక్షురాలు గాయత్రీ, మాధవి, మధు, ఇమ్మడి రాంబాబు, రేగూరి శ్రీనివాస్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

బయ్యారం, జనవరి 30: విద్యార్థులు చదువుకునే వయసులోనే వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు డాక్టర్ పరికపండ్ల అశోక్ అన్నారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులను వార్షిక పరీక్షలకు సమాయత్తం చేయడంలో భాగంగా మంగళవారం బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల్లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రచారి, ఉపాధ్యాయులు భిక్షం, వెంకటేశ్వర్లు, రమణమ్మ, సుధాకర్, రవీందర్, ప్రభు పాల్గొన్నారు.

బాలల రక్షణకు కృషి చేయాలి

బయ్యారం, జనవరి 30 :బాలల రక్షణకు సమాజంలో ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ సీనియర్ కో-ఆర్డినేటర్ కరుణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బయ్యారం మండలం కొత్తగూడెం, కోయగూడెం గ్రామాల్లో మంగళవారం ఎఫ్ఎం సంస్థ ఆధ్వర్యంలో పిల్లలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వారు బాల్య వివాహాలు, బడి బయట పిల్లలు, గృహ హింస, బాలికలపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా మొదలగు సమస్యల బారిన పడకుండా తగు సలహాలు, సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ వెంకటరమణ, ఎంఎఫ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ వెంకటేశ్, హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

మంత్రుల దృష్టికి స్థానిక సమస్యలు

బయ్యారం, జనవరి 30 : కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్నా స్థానిక సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నేతలు మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి నేతృత్వంలో మంత్రులను కలిసిన నేతలు పలు అంశాలను వివరించారు. మంత్రులను కలిసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సోమేష్, నాగేశ్వరరావు, రవి నాయక్, రాంమూర్తి, శ్రీనివాస్, వెంకటపతి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ధూపదీప నైవేద్య నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ, జనవరి 30: మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని పీఏసీఎస్ భవన్‌లో మంగళవారం జిల్లా ధూపదీప నైవేద్య కమిటీ ఎన్నికను ఆ సంఘం సభ్యులు మంగళవారం సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసచారి, రఘురాంశర్మ, కార్యదర్శిగా లింగోజ్ వెంకటాచారి, గౌరవ సలహదారులు సముద్రాల లక్ష్మీనర్సింహాచార్యులు, ప్రచార కార్యదర్శి సాయికుమార్ ఎన్నికైనట్లు కృష్ణమాచార్యులు విలేకరులకు తెలిపారు.

సరస్వతిదేవి, గాంధీ విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న వాసవీక్లబ్, వనిత క్లబ్ బధ్యులు

మరిపెడ, జనవరి 30: మరిపెడ హైస్కూళ్లో మంగళవారం స్థానిక వాసవీక్లబ్, వనితక్లబ్ బాధ్యులు సరస్వతీదేవి, మహాత్మ గాంధీ విగ్రహాలను వితరణ చేసి ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘ బాధ్యులు గర్రెపల్లి వెంకన్న, మంజుల మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతీదేవి అన్నారు. వుల్లి విజయ్, కిరణ్, ఉల్లి సునీత, జ్యోతి, ట్రస్ట్ చైర్మన్ ఉప్పల నాగేశ్వర్‌రావు, రీజనల్ చైర్మన్ భద్రయ్య, ధారం నాగేశ్వర్‌రావు, బోనగిరి సురేశ్, భరత్, శ్రీనివాస్, ఉల్లి శ్రీనివాస్, రాంబాబు, నాగయ్య, ఎర్రమళ్ల వెంకటేశ్వర్లు, చారుగొండ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించాలి

కురవి, జనవరి 30 : ఆర్థికంగా స్థిరపడ్డవారు ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించాలని కురవి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు ఓమ ఉదయ్‌కుమార్, బి.రాంబాబు, చెన్నబోయిన వీరేందర్ అన్నారు. కురవి జడ్పీహెచ్ఎస్‌కు రూ.75 వేల విలువగల రసాయినాలు, సైన్స్ పరికరాలు, జీవశాస్త్ర నమూనాలు బహుమానంగా అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు, ఉపాధ్యాయులు ఎం.శ్రీధర్, పి.లక్ష్మయ్య, డి.వెంకటేశ్వర్లు, బి.వెంకన్న, ఎస్. విజయలక్ష్మి, వి.శ్యామలాదేవి, బి.రవీందర్, వి.విజయ్‌రాజ్, నర్సింహాచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి

నెల్లికుదురు జనవరి 30 : అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రాజు తెలిపారు. నెల్లికుదురు మండల కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్ఐ అబ్దుల్‌రహమాన్ పాల్గొన్నారు.

గండిపెట్టిన వారిపై చర్య తీసుకోవాలి

నెల్లికుదురు, జనవరి 30 : నెల్లికుదురు మండలంలోని మునిగలవీడు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఎస్సారెస్పీ కాలువకు గండిపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు బుద్దె వెంకన్న మంగళవారం తహసీల్దార్ రాజుకు ఫిర్యాదు చేశాడు. అనంతరం రైతు బద్దె వెంకన్న మాట్లాడుతూ మునిగలవీడులో తనకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని భూమి పక్కనుంచి ఎస్సారెస్పీ కాలువ ఉందని కాలువ ద్వారా బొజ్జన్నపెట గ్రామానికి ఎస్సారెస్పీ నీరు వెళతుందన్నారు. మునిగలవీడు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కాలువకు గండిపెట్టడంతో తన పొలం కొట్టుకుపోయి నష్టం జరిగిందని తెలిపాడు. గండిపెట్టి పంటనష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 :మహబూబాబాద్ మండల పరిషత్‌లోని నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఎంపీటీసీలు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య మాట్లాడుతూ... మహబూబాబాద్ మండల పరిషత్‌లో గత నాలుగేళ్లుగా నిధులు దుర్వినియోగం చేయడమే కాకుండ ఎంపీటీసీ సభ్యుల సంతకాలు లేకుండ, వారిని సంప్రదించకుండ నిధులు వాడుకోవడం వంటి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ఎంపీపీ భూక్య మౌనికపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీలు రాంచంద్రునాయక్, మంగీలాల్, యాకాంబ్రం, రోజా, నరేష్ పాల్గొన్నారు.

ఇనుగుర్తి పాఠశాలలో స్వయం పరిపాలన

ఇనుగుర్తి, జనవరి 30 :ఇనుగుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠశాలను నడిపించారు. హెచ్‌ఎంగా పరమేష్, ఎంఈవోగా సింధూజ, డీఈవోగా లక్ష్మీప్రసన్నతో పాటు ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రూపారాణి ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొమ్ము రాజేందర్, యాకయ్య, కుమారస్వామి, కిషన్, దేవేందర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో లక్ష్మణ్ కృషి అభినందనీయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా(ఎస్) సర్పంచ్ బోడ లక్ష్మణ్‌నాయక్ పాత్ర అభినందనీయమని జడ్పీ కోఆప్షన్ సభ్యులు షేక్.మహబూబ్‌పాషా అన్నారు. ఇస్లావత్‌తండాలో గ్రామపంచాయతీ పాలకమండలి పదవీకాలం ముగియనుండడంతో గ్రామాభివృద్ధికి పాటుపడిన సర్పంచ్ బోడ లక్ష్మణ్‌నాయక్‌తో పాటు వార్డుసభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దర్శనం రామకృష్ణ, ఇనుగుర్తి సుధాకర్, మంద శశికుమార్, అంగోతు చందులాల్, భూక్య వీరన్న, పొన్నాల యుగేంధర్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేయడం గొప్ప అవకాశం

కురవి, జనవరి 30 :ప్రజాప్రతినిధిగా ప్రజలకు సేవ చేయడం గొప్ప అవకాశమని కురవి జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి అన్నారు. కురవి మండలం గుండ్రాతిమడుగులో గ్రామపంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, వార్డుసభ్యులు మిర్యాల రాంబాబు, బస్వ భవాని , ఉపేందర్, మందుల వెంకటలక్ష్మి, ఎండి.జాఫర్, ఈర్ల వీరమ్మ, తురక మల్లీశ్వరినిసన్మానించారు.

ఫిబ్రవరి 6 వరకు ఓటు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 30: నల్లగొండ,ఖమ్మం,వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులంతా ఫిబ్రవరి 6 వరకు తమ ఓటును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచారం చేపట్టి అధ్యాపకులకు ఫారంలను అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి నీరుటి సురేష్, నాయకులు రాంశెట్టి వీరేందర్, పింద్రాల రాందాసు, శంతన్ రామారాజు, వీరన్న, యాకన్న, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 30 : ఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన విద్యార్థి పండను ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ మండలం రెడ్యాల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థి పండును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మోహన్‌నాయక్, డాక్టర్ మౌనిక, ఏసీఎంవో ఈరులాల్, ఏటీడీవోలు సత్యవతి, భాస్కర్ పాల్గొన్నారు.